# 'పంచముఖి'లో ఒక ఉదయం

- బద్దిగం అరుణశ్రీ

మా నాన్నగారి తాతగారి కాలంలో మాకో జమిందారీ ఉండేదట! మా తాతగారి హయాంలో సువిశాలమైన స్థలంలో కట్టారు ఈ భవనాన్ని. జమిందారీలన్నీ ఊడ లాక్కోగా మిగిలిపోయింది ఈ 'పంచముఖి' మాత్రమే. మా నాన్నగారికి అంత ఇంటిని ఒక్కళ్ళు భరించడం కష్టం అనిపించిందట. మొదట ఈ మేడని అంతా 'పిచ్చికగూళ్ళ' మేడ అనేవారట. అంటే మేడంతా పిచ్చిక గూళ్ళున్నాయని అర్థం కాదు. బయట నుంచి చూసేవాళ్ళకి అలా అనిపించేదట.

రెండు కారణాలవల్ల ఆ మేడని రీమోడలింగ్ చేయించాల్సి వచ్చింది. అంత పెద్ద ఇంట్లో మేం ఆరుగురం మాత్రమే ఉండాలంటే బిక్కుబిక్కు మంటూ ఉండేది. మరో కారణం దాని రిపేరు ఖర్చులే మా నాన్నగారి జీతాన్నంతా తినేస్తూండేది. మరో కారణం దానికి పిచ్చికగూళ్ళ మేడ అన్న పేరు శాశ్వతం అయిపోతుందేమోనని మా నాన్న గారి అంతర్గత భయం. ఆ కారణం చేతనే ఇంటిలో ఏ మూలా ఒక్క పిచ్చిక గూటిని కూడా ఉండనిచ్చే వారుకాదు.

ఇన్ని కారణాలచేత మా మకాం మేడ పైభాగానికి మార్చి, క్రింది భాగాన్నంతా రెండు వాటాలుగా విభజించి అద్దెలవాళ్ళకిచ్చేశాం. మా ఇంటి ముందుకి చెరోవైపు రెండు అవుట్ హౌస్‌లుండేవి. అవుట్ హౌస్‌లంటే రేకుల షెడ్లనుకునేరు. కాదు, ఓ చిన్న సంసారం సుఖంగా, సౌకర్యంగా ఉండటానికి వీలయిన చిన్న ఇళ్లు. మా నాన్నగారు చేయించిన మరో పనేమిటంటే ఈ క్రింది నాలుగిళ్ళకి, పైమీది మా భాగానికి ప్రముఖంగా కనబడేట్టుగా దిట్టమ యిన దర్వాజాలు పెట్టించారు. బహుశా పంచ ముఖి అన్న పేరు దానికి సూటవ్వాలని కాబోలు.

మా చిన్నతనంలో మా అమ్మమ్మగారు సణు గుతూ ఉండటం నాకు బాగా గుర్తు. "ఏమిటి నాయనా! జమిందారీ మేడని కాస్త ఐదువాకిళ్ల కొంపగా మార్చేసావు" అనేవారావిడ. మా నాన్న గారు మరోసారి భయపడిపోయి పిచ్చికగూళ్ళ మేడ కాస్త ఐదు వాకిళ్ళ కొంపగా స్థిరపడిపోతుందే మోనని తక్షణమే వీధి గోడకి తెల్ల పలకమీద నల్లటి అక్షరాలతో 'పంచముఖి' అన్న పేరు చెక్కించి తాపడం చేయించారు. మా ఇంటి ముందు ఖాళీ స్థలంలో పెద్ద మామిడి చెట్టు ఒకటి వుంది. దాని చుట్టూ తిన్నెలాగ పెద్ద సిమెంటు అరుగు కట్టిం చారు. అది సాయం సమయాల్లో పురుష విభాగా నికి సభావేదికగానూ, ఉదయాల్లోనూ, తీరిక వేళ లందు మహిళా విభాగానికి ఉపయోగపడుతూ ఉంటుంది. మా ఇంటికి మరో ముఖ్యమైన ఆకర్షణ ఏమిటంటే ఆ వీధిలో కుడి ఎడమల నుంచి వెళ్ళవ లసిన జనాభా అంతా మా మేడ దాటిగానీ మరో వీధిలోకి అడుగు పెట్టలేరు. మా ఇంటికి అదో పెద్ద అట్రాక్షను. మా ఇంటి మహిళా విభాగానికి ప్రెసి డెంట్ నర్సమ్మ పిన్నిగారు. నాలుగు పదులు దాటిన మనిషి. ఇద్దరాడపిల్లలు, ఒకే ఒక మగ నలుసు. ముగ్గురూ ఒకే కాలేజీలో ఒకే క్లాసు చదు వుతున్నారు. ముగ్గురూ ఒకే క్లాసంటే వాళ్ళ మేధాశ క్తిని కించపరుస్తారేమోనని పిన్నిగారు 'అసలు నావి చాలా దగ్గర కానుపుల్లెండి. ఒక్కొక్కళ్ళకి గట్టిగా తొమ్మిదినెల్లు కూడా తేడాలేదు' అంటూ ఉంటారు. పిన్నిగారి సంసారం మేడ క్రింద కుడి భాగాన్నాక్ర మించారు. పిన్నిగారంటే మిగిలిన వాళ్ళందరికీ మంచి గురి. ఆవిడ వాగ్ధాటి ఓ కారణం, ఆవిడ విషయ సేకరణా చాతుర్యం మరో కారణం.

ఎడమవైపు భాగాన్నాక్రమించినావిడ అనసూ యమ్మగారు. మూడు పదుల్లో ఉన్న యువతి. నలుగురు ఆడ సంతానం. ఎప్పుడూ 'ఎందుకొ చ్చిన బ్రతుకురా దేవుడా' అన్నట్టుగా వుంటుంది. మగ నలుసుకోసం ఎదురు చూస్తున్న లలనామణి.

మా కుడివైపు అవుట్ హౌస్‌ని ఆక్రమించినావిడ శ్రీమతి రాధాదేవి. కాలేజీ డిగ్రీ. ఇద్దరంటే ఇద్దరే మగపిల్లలు ఆవిడ ఎసెట్స్. తనకున్నది ఇద్దరూ మగపిల్లలే అన్న అహం అప్పుడప్పుడు ఆవిడ మాటల్లో తొంగి చూస్తూ వుంటుంది. అనసూయ మ్మను ఏదో ఒకటి అంటూ ఉండడం అలవాటు.

మా ఎడమప్రక్క అవుట్ హౌస్‌వాటాలో ఓ యువ దంపతుల జంట. అతనయితే అచ్చం ఆంధ్రుడేగాని ఆ పిల్ల మాత్రం హిందీ, తెలుగు పిల్ల. అంటే నా ఉద్దేశ్యం ఆ పిల్ల తాత ముత్తాతలు పర రాష్ట్రంలో స్థిరపడిపోయి హిందీ మనుషులుగా మారిపోయారని, ఆ కుర్రాడు ఆరునెలల ట్రైనింగ్ కోసం వెళ్లి నాలుగో నెల్లో పిల్లని ప్రేమించి అయిదో నెల్లో పెళ్లాడి, ఆరోనెల్లో తీసుకొచ్చి మా ఇంట్లో కాపురం పెట్టాడు. ఆ పిల్లకి బొత్తిగా తెలుగు రాదంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడిప్పుడే అన్నం, పప్పు, అన్న, తమ్ముడు లాంటి సరళ పదాలు నేర్చుకుంటోంది. తెలుగు వాళ్ళం తెలుగు మాట్లా డినట్లుగా మాట్లాడితే ఒక్క ముక్క అర్థం కాదు సక్కుబాయికి. హిందీ వాళ్ళు తెలుగు మాట్లాడిన ట్లుగా అయితే కాస్త అర్థం చేసుకుంటుంది.

కథా ప్రారంభోత్సవ సమయంలో పిన్నిగారు ఆ రోజు పదిగంటలకే అత్యవసర సమావేశాన్ని ప్రారంభించారు. మామూలు టైమయితే పదకొం డున్నర గంటలకి మావిడి అరుగుమీద అందరూ సమావేశమయ్యేవారు.

"అనసూయ...అనసూయ" అంటూ కేకలు పెడుతూ తిన్నె దగ్గరకు చేరారు పిన్నిగారు.

ఇంట్లో పిల్లలతో సతమతమవుతున్న అనసూయ "వచ్చే పిన్నిగారూ!" అంటూ నీరసంగా బదులు పలికింది.

"విన్నావా ఈ సంగతి!" కాస్త గట్టిగా మళ్లీ కేక పెట్టారు పిన్నిగారు.

పిల్లలిద్దర్నీ కాన్వెంట్ స్కూల్‌కి పంపించేసి టేబు ల్‌మీద భోజనానికి ఏర్పాట్లు చేస్తున్న రాధ ఆదు ర్దాగా కూర గిన్నె చేత్తో పుచ్చుకుని కిటికీ దగ్గరకొ చ్చింది పిన్నిగారి కేకలు విని.

"అప్పుడే భోజనమయిపోయిందా పిన్ని గారూ?" అంది ఆత్రంగా.

పిన్నిగారు రాధ ప్రశ్నకి జవాబు చెప్పకుండా "ఇది విన్నావా రాధా!" అన్నారు రాధ ఇంటి డైరెక్ష న్‌లో మెడ తిప్పుతూ.

రాధ చప్పున కూర గిన్నెని టేబుల్ మీద పడేసి గ్యాస్ స్విచ్ ఆఫ్‌చేసి తిన్నె దగ్గరకొచ్చింది గబగబా "ఏమిటి పిన్నిగారూ ఏమిటీ?" అంటూ.

"సరే! నీకింకా తెలియదన్నమాట!" అన్నారు పిన్నిగారు. సస్పెన్స్‌లో ఉంచడం పిన్నిగారికి మహా చెడ్డ సరదా!

"తెలియదే. ఏమిటి సంగతి?" అంది రాధ అన సూయ వాటావైపు చూస్తూ. అంతా వస్తేగానీ పిన్ని గారు విషయాన్ని బయటపెట్టరుకదా!

"ఆ రంగనాథం లేడూ..."

"ఏవిటీ! పాపం రంగనాథం భార్య కాస్తా పోయిం

దంటావా ఏవిటీ? పాపం నెలరోజులుగా హాస్పిట లీలో వుందిట!'' అంది జాలిగా రాధ.

"ఓయ్ నీ అఘాయిత్యం కూలా! ఆ సంగతి కాదమ్మాయ్! రంగనాథం భార్యకేం నిక్షేపంలాగా వుంది. గుండ్రాయిలాగా ఇంటికి తిరిగి వచ్చింది నిన్న'' అన్నారు పిన్నిగారు సక్కుబాయి వాటా వైపు దృష్టి సారిస్తూ.

సక్కుబాయి మెట్లమీద నిలబడివుంది పిన్ని దగ్గ రికి వెళదామా వద్దా అన్న సందిగ్ధంతో. వాళ్ళు మాట్లాడే దాంట్లో నాలుగో వంతే అర్థమవుతుం దయ్యో గొడవ!

"అమ్మగోరూ! ఒణ్ణవడెయ్యండి. పొద్దోతుంది. ఇంటికి బోవాల'' అంటూ జుట్టు చేత్తో గిరుకున ముడేసుకుంటూ వచ్చింది పనిమనిషి లచ్చి.

పిన్నిగారికి, రాధమ్మకి జాయింటు పనిమనిషి అది.

"నీ దుంపతెగ ఉండవే. ఎప్పుడూ తిండి రంధేనా, ఇంటికిపోయి ఏం ఏడుస్తావు? మొగుడా మొద్దులా'' అంటూ గద్దించారు పిన్నిగారు. ఇంకా రాని అనసూయమ్మ మీది విసుగునంతా లచ్చిమీద కురిపిస్తూ.


"బాగుందమ్మా నువ్వు చెప్పేది. మొగోడునే పోతే ఇంటికి పోనక్కర్లేదేవిటి నర్సమ్మగోరూ'' అంటూ కింద ఇటిక రాయిమీద కూలబడింది.

రాధ కోపంగా, అసహనంగా చూసింది అన సూయ వాటావైపు.

"అమ్మా! ఆకలేస్తోంది అన్నం పెట్టవే'' అంటూ కొంగు పుచ్చుకుని వేళ్లాడుతున్న నాలుగేళ్ళ పిల్లని గద్దిస్తూ "ఛీ...ఉండవే దరిద్రపుగొట్టుదానా! అప్పుడే ఆకలేవిటి. పొద్దున మింగిన రొట్టెలన్నీ ఏ మూలకి పోయాయి'' అంటూ ఒక కసురు కసిరి పైకి దోపిన చీర చెంగులు విదిలిస్తూ వడివడిగా వచ్చింది అనసూయ.



## అమీషా-అక్షయ్



ముంబయ్‌లో రెస్టారెంట్ నడుపుకుంటూ అప్పుడప్పుడూ వచ్చే ఆఫర్లతో బిజీగా ఉన్న అమీషా ఈమధ్య వార్తల్లో వ్యక్తిగా మారింది. నటుడు అక్షయ్‌తో కలిసి తిరుగుతున్నట్టు వార్తలొచ్చాయి. 'మా మధ్య ఉన్నది ఫ్రెండ్‌షిప్ మాత్రమే. హమ్‌రాజ్ సినిమా తరువాత మేం తరచూ కలుసుకుంటున్నాం. కెరీర్ గురించి చర్చించుకుంటున్నాం' అంటోందీ అమ్మడు. వీరిద్దరూ కలిసి నటిస్తున్నారా? లేక కలిసి జీవించడానికి ప్రయత్నాలు చేస్తున్నారా అన్నది మాత్రం ఎవరికీ అంతుపట్టని విషయం.

\- రాజా

"వెధవ సంత. పనే తెమిలి చావదు పిన్నిగారూ ఎంత చేసినా. ఏమిటి విశేషం? అప్పుడే అందరి భోజనాలు అయిపోయాయా ఏమిటి?" అంది నీరసంగా.

అనసూయమ్మ రాకతో సక్కుబాయిలోని ఉత్కంఠ పరాకాష్టనందుకుంది. తిన్నె దగ్గరికి బయలుదేరింది. పిన్నిగారు సక్కుబాయిని చూసి మొహం చిట్లించారు. రాధ, అనసూయ మెల్లగా నవ్వేశారు. దానికి కారణం కూడా వుంది.

సక్కుబాయి వచ్చిన మొదట్లో పిన్నిగారు కొత్త పిల్లకదా మనలో కలుపుకుందాం అన్న సదుద్దేశంతో వెళ్లారు. ఆ సమయానికి సక్కుబాయి భర్త కూడా ఇంట్లోనే ఉన్నాడు. పిన్నిగారి ప్రశ్నలకి సక్కుబాయి తరఫున కూడా తనే సమాధానాలు చెప్పాడు. ఓ అరగంట అయ్యాక పిన్నిగారి యక్ష ప్రశ్నలకి విసిగిపోయి గదిలోకి వెళ్లి పడుకున్నాడు. పాపం సక్కుబాయి ఒంటరిగా పిన్నిగారితో మిగిలిపోయింది.

పిన్నిగారు ఇన్ఫర్మేషన్ సరఫరా చేస్తున్న ధోరణిలో సక్కుబాయి వైపు తిరిగి మెల్లగా "ఆ రాజ్యం తెలుసా? ఈ వీధి చివర ఇల్లు" అన్నారు.

కాస్త కాస్త అర్థమయింది సక్కుబాయికి.

"అయితే ఏమిటి?" అన్నట్లు తలూపింది.

"ఆవిడకి ఆరుగురు ఆడపిల్లలా! ఇప్పుడు మళ్ళీ నీళ్ళోసుకుంది" అన్నారు ఆరుగురిని వత్తి పలుకుతూ.

సక్కుబాయి వింటూ ఉండిపోయింది. తను చెప్పిన మాట ఆ పిల్లకి అర్థమయిందో లేదో తెలియలా పిన్నిగారికి.

"నీళ్లోసుకుంది ఏడోమాటు" అన్నారు మళ్ళీ.

"ఏవిటీ?" అన్న మొహం పెట్టింది సక్కుబాయి.

"కడుపుతో ఉంది" అన్నారు మళ్ళీ.

కళ్ళు పెద్దవి చేసి చూసింది సక్కుబాయి.


"కనబోతోంది" అన్నారు మళ్ళీ కాస్త దగ్గరికి జరుగుతూ.

టపటపా కళ్లార్పింది సక్కుబాయి.

పిన్నిగారికి చిర్రెత్తుకొచ్చింది.

"ఓనెల్లో పురుడు రాబోతోంది" అన్నారు గట్టిగా.

సక్కుబాయి బెదిరిపోయింది. పిన్నిగారు ఎందుకు కేకలేస్తున్నారో తెలియక కళ్ళనీళ్ళ పర్యంతమయింది. గదిలోంచి ఈ దృశ్యాన్ని గమనిస్తున్న సక్కుబాయి భర్త "మా హోనే వాలీహై" అంటూ కేక పెట్టాడు ఒళ్ళు మండి. సక్కుబాయి అర్థమయినట్టుగా చిరునవ్వు నవ్వి "ఓ..ఓ" అంది గాలి పీలుస్తూ.




పిన్నిగారికి ఒళ్ళు మండిపోయింది. ఈ పిల్లకి బాగా తెలుగు రాదనుకుందిగానీ బొత్తిగా రాదాయేం ఖర్మ. పిన్నిగారికి వన్‌వే ట్రాఫిక్కు నచ్చదు. తను చెప్పే సమాచారానికి, అందించే వార్తలకి శ్రోతల నుంచి కనీసం "ఓహో... అలాగా తెలియదండీ? అబ్బా.. పాపం!" లాంటి ప్రోత్సాహకరమయిన మాటలు ఆశిస్తూ ఉంటారు. చివాలున లేచొచ్చేశారు పిన్నిగారు. అప్పట్నుంచీ సక్కుబాయిని చూసినప్పుడల్లా పిన్నిగారి కనుబొమలు నాట్యం చేస్తూ ఉంటాయి.

"పదిగంటలయిందో లేదో అప్పుడే ఆకలిట ఈ మేళానికి. వెధవ పని తెమిలి ఏడవమని" అంది రెండోసారి అనసూయ.

"ఒకళ్ళకొకళ్ళు ఎక్కువయినకొద్దీ అంతే పిన్నిగారూ! అందుకే మన ప్రభుత్వం ఒకరో ఇద్దరో అంటుంది" అంది రాధమ్మ అనసూయవైపు చూసీ చూడనట్లుగా చూస్తూ.

"అయితే నాకిప్పుడు నలుగురు పిల్లలనేగా నీ బాధంతా! మహా ఎట్లాగయితేనేం ఇద్దరూ మగపిల్లలేనని కొమ్మెక్కకు" అంది అనసూయ రుసరుసలాడుతూ.

"నేనిప్పుడు ఆడా మగా అన్నానా ఏవన్నానా? అయినా ఎవరదృష్టం వాళ్ళది?" అంది రాధ పిన్నిగారివైపు చూస్తూ అదృష్టం అంతా తనదే అయినట్టు.

"ఆహా అదృష్టమే. రేపు కాళ్ళుచేతులు పడ్డప్పుడు కొడుకుకోడలు ఇంట్లోంచి గెంటి తలుపేసుకుంటే అప్పుడు తెలుస్తుంది ఆడ తోడు ఎంత ముఖ్యమో" అంది అనసూయ కొరకొరలాడుతూ.

"చూసారా పిన్నిగారూ! చూసారా నా కాళ్ళూ చేతులూ పడిపోతాయట. కొడుకూ కోడలు గెంటేస్తారట. చూసారా ఆ మాటలు" అంటూ గొంతులోకి సాధ్యమైనంత దుఃఖాన్ని తెప్పించడానికి ప్రయత్నించింది రాధమ్మ.

పిన్నిగారు నిస్సహాయంగా ఇద్దరివైపు చెరోసారి చూసారు. తను పిలిచిందెందుకు? వీళ్ళు చేస్తున్నదేమిటి? ఉప్పునిప్పులాంటివాళ్ళు, రామాయణంలో పిడకలవేటలాగా.

"ఒసేయ్ లచ్చీ! పద నీకు అన్నం పెట్టేస్తాను" అన్నారు గంభీరంగా ఓ అడుగు ముందుకేస్తూ.

దోషులిద్దరికీ తమ తప్పు తెలిసొచ్చింది. ఇద్దరూ ఆత్రంగా ఓ అడుగు ముందుకేసి పిన్నిగారి చెరో చెయ్యి పుచ్చుకున్నారు.

"అయ్యో! వెళ్లిపోతున్నారేమిటి పిన్నిగారూ! ఇంతకీ సంగతి చెప్పనేలేదు" అన్నారు ముక్తకం

రంతో.

పిన్నిగారు మాట్లాడకుండా మరో అడుగు ముందుకేస్తూ "ఆ ఏంలేదులెండర్రా! మీ గొడవేదో కానియ్యండి ముందు" అన్నారు చిరాగ్గా!

"భలేవారే పిన్నిగారూ! అసలు విషయం చెబుదురూ! లేకపోతే రాత్రంతా నిద్ర పట్టక చస్తాం బాబూ!" అన్నారు ఇద్దరూ బతిమాలుతున్నట్లుగా.

పిన్నిగారు చల్లబడ్డారు. లేవబోయిన లచ్చి మళ్ళీ కూలబడింది. సక్కుబాయి తిన్నెమీద దుమ్ము దులిపి కూర్చుంది.

"ఇవాళ పొద్దున హాస్పిటల్లో చేర్చారట" అన్నారు పిన్నిగారు గంభీరంగా ఎవర్నో చెప్పకుండా.

"ఎవర్ని? గోపాలం కొడుకునా ఏమిటీ? నిన్న రాత్రి పక్కవాళ్ళ గోడ దూకబోతూ... మురిక్కాలవలో పడ్డాట్ట" అంది అనసూయ ఆత్రంగా.

"నీ తలకాయ. రాజ్యాన్ని హాస్పిటల్లో చేర్చారట" అన్నారు నెమ్మదిగా అందరిమీద తన మాటలు ఎలా పనిచేసాయో పరిశీలిస్తూ.

"ఏమిటీ? రాజ్యాన్నే? ఏం పిల్లా? మళ్ళీ ఆడపిల్లేనా?"

"మగపిల్లాడా ఏమిటీ?"

"కానుపయిపోయిందేమిటి నర్సమ్మగోరూ!" అంటూ అంతా ఒక్కసారిగా పిన్నిగారి మీదకి ఎగబడ్డారు. వాళ్ళ మొహాల్లోని ఆతృత, ఆసక్తి గమనించి పిన్నిగారు తృప్తిగా తలూపారు.

"ఇంకా లేదర్రా! పొద్దున ఆరుగంటలకి చేర్చారట" అన్నారు.

"పాపం ఈసారయినా మగపిల్లవాడయితే బాగుండును. అబ్బా! ఆరుగురు ఆడపిల్లలు" అంది డోకొచ్చేట్టుగా మొహం పెడుతూ రాధ.

"ఏవో, ఎవరయినా అవొచ్చు. మన చేతుల్లో ఏవుందీ" అంది నీరసంగా అనసూయ.

"క్యాహువా" అంటూ పిన్నిగారు వినకుండా రాధని అడిగింది. సక్కుబాయి, పిన్నిగారు వినేట్టు గట్టిగా సమాధానం చెప్పింది రాధ హిందీలో.

"లడకాయా లడికీ" అంది ఉత్సాహంగా చూస్తూ సక్కుబాయి.

"నీ బొంద" అన్నారు పిన్నిగారు ఎటువైపో కొరకొరా చూస్తూ.

అనసూయ, రాధ వచ్చే నవ్వాపుకుంటూ దిక్కులు చూడసాగారు. అర్థంకాని సక్కుబాయి 'ఏమిటీ' అన్నట్లుగా చేత్తో సౌంజ్ఞ చేసింది రాధకేసి. రాధ ఏవీ లేదన్నట్లుగా మూతి తిప్పింది.

"బగమంతుడు ఈపాలయినా ఓ మగబిడ్డనిస్తే బాగుండును రాజ్యం లచ్చమ్మకి" అంది లచ్చి.

"పాపం ఆవిడ చెయ్యని పూజలు, వ్రతాలు లేవనుకో. మొన్న ఏప్రిల్లోనేగా రామేశ్వరంలో నాగప్రతిష్ఠ చేసొచ్చారు. అనసూయా! మీరు కూడా రామేశ్వరం వెళ్లి రాకూడదూ?" అంది రాధ అమాయకంగా అనసూయవైపు చూస్తూ.

"మేమేం మగపిల్లల కోసం ఏడవడంలేదులే" అంది అనసూయ మళ్ళీ హీటెక్కిపోతూ.

"మరయితే...." ఏదో అనబోయిన రాధ పిన్నిగారిని చూసి మానేసింది.

"అసలు ఈ విషయం గమనించారర్రా మీరు? రాజ్యం అన్నయ్య ఉన్నాడా? అతనికందరూ మగపిల్లలే. రాజ్యం అక్కయ్య ఉందా! సగం మగ సగం ఆడానూ. రాజ్యానికేమో అంతా ఆడమేళం. ఏమిటి భగవంతుడి లీలలు. అంతా మన చేతిలో ఉందని మిడిసిపడతాం" అన్నారు పిన్నిగారు వేదాంత ధోరణిలోకి దిగుతూ.

"అసలు సైన్సులో అదేదో చెబుతారు పిన్నిగారూ. జీన్సో ఏవో కారణమంట ఈ ఆడా మగా తేడాలకి" అంది రాధమ్మ ఏనాడో మర్చిపోయిన జెనెటిక్స్ గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ.

"పాపం ఈసారి కూడా ఆడపిల్లయితే రాజ్యం ఇహ ఎవరికీ మొహం చూపించలేదు" అన్నారు జాలిగా పిన్నిగారు.

"ఈరోజుల్లో ఆడా, మగా ఒకటేలెద్దురూ. వాళ్ళు ఊరేగించేదీలేదు, వీళ్ళు ఉద్ధరించేదీ లేదు" అంది అనసూయ ఓరగా రాధవైపు చూస్తూ.

తలమీద చెయ్యి పెట్టి కూర్చున్న లచ్చికి ఇదంతా విచిత్రంగా ఉంది.

"అక్కడ రాజ్యాలచ్చమ్మ ఆస్పతాల్లో నొప్పులడతావుంటే ఈళ్ళంతా మావిడి చెట్టుకింద తేలు కుట్టినట్టు ఇల్ల ఇల్లాడతారేటంట! మొగోడు పోయేనాటికి తనకి పదిమంది పిల్లలుగాదా! ఆడే బతికుంటే మరో ఇద్దర్నయినా కనకపోయేదా? ఆ రాజ్యాలచ్చమ్మకి ఓపికుంది. కంటాది! మద్దిన ఈళ్ళకెందుకంట రంధి!"

"అమ్మోయ్! మణి మళ్ళీ బిందె దొర్లించేసిందే" అంటూ పరుగుపెడుతూ వచ్చింది అనసూయమ్మ ప్రథమ పుత్రిక.

"అది కూడా నాకు చెప్పాలిటే. బిందె సరిగ్గా తగలేసి దాన్నో మూల కూలెయ్" అంటూ కసురుకుంది అనసూయ. ఈ పిల్లమేళం మూలంగా సమావేశం మధ్యలోంచి వెళ్లాల్సొస్తుందే నోన ని ఆమె బాధ.

సక్కుబాయి పన్నెండు గంటలకి వాళ్ళాయన ఇంటి

## ఇలా...

"చిన్న చిన్న అప్పులన్నీ ఒకేసారి తీర్చేసి ఇప్పుడు ప్రశాంతంగా ఉంటున్నాను గురూ!"

"ఒకేసారి అప్పులన్నీ తీర్చేశావా? ఎలా?"

"పెద్ద అప్పు చేసి!"

## వృత్తి

"మీవారు అబద్ధాలతో లక్షలు సంపాదిస్తున్నారా? అదెలా?"

ఆశ్చర్యంగా అడిగింది అవంతి.

"మావారు లాయర్లే" అసలు సంగతి చెప్పింది స్రవంతి.

## స్వీయానుభవం

"తప్పుచేసిన ప్రతి వ్యక్తీ శిక్ష అనుభవించక తప్పదు అని రాసుందండీ ఈ పుస్తకంలో. నిజమేనంటారా?" భర్తని అడిగింది భార్య.

దానికా భర్త ఇలా బదులిచ్చాడు.

"ముమ్మాటికీ నిజమే. నిన్ను చేసుకున్న తప్పుకి నేను శిక్ష అనుభవించడంలేదూ?"

## శాకాహారి

"నువ్వు శాకాహారినన్నావ్? మరి మేక మాంసం తింటున్నావేంటి?"

"భలేవాడివే. మేకలు ఆకుల్నే కదా తింటాయి?"

## కోరిక


"నీకోసం నేను ఎలాంటి త్యాగమైనా చేస్తాను పద్మా!" ప్రేయురాలితో అన్నాడు మోహన్.

"నిజంగానా?" అడిగింది పద్మ.

"నిజం!"

"అలాగైతే నీ ఫ్రెండ్ కార్తీక్‌కి ఇటీవల అదేదో లాటరీలో పదిలక్షలొచ్చాయన్నావుగా! అతని అడ్రస్ నాకివ్వు!"

- పరిమళా కిశోరి (మేడిబావి)




# ఢంకా మోగించే వ్యక్తి

మనం ఏదైనా ఓ విషయాన్ని గట్టిగా చెప్పేప్పుడు 'బల్ల గుద్ది మరీ చెప్తున్నా' అంటాం. మరి అలాగే ఢంకా మోగించి చెప్పే వ్యక్తి ఒకడున్నాడండీ జపాన్‌లో. హయిషీ అనే ఓ వ్యక్తి ఢంకా మీద వీరబాదుడు బాదుతున్నాడుట. యూరప్, లాటిన్ అమెరికా, ఆసియా దేశాలలో ఈ ఢంకా మోగించి వచ్చేసాడుట. ఈ ఔత్సాహిక కళాకారుడు చిన్నపిల్లలకు ఢంకా ఉపయోగించడంలో శిక్షణ కూడా ఇస్తున్నాడుట. ఈ ఢంకా పైన రెండు బ్యాట్లు పట్టుకుని వీరబాదుడు బాదుతున్నప్పుడు తనకి వేరొకరు సహాయంగా ఉండాలని చెప్తున్నాడు. ఏది ఏమైనా ఇతనిప్పుడు ఫుల్ బిజీగా ఉన్నాడుట.

# నాన్‌స్టాప్ ఏడుపు

ఓ అరగంట మన పిల్లలు ఏడిస్తేనే 'అబ్బ! వెధవ ఏడుపు' అని విసుక్కుంటాం. అలాంటిది రోజుకి 20 గంటలు నాన్‌స్టాప్‌గా ఏడిస్తే? నెండీబాక్లెట్ అనే ఆవిడ తన రెండేళ్ళ కూతురు ఏడుపు భరించలేక ఎందరో డాక్టర్లవద్దకు తీసుకువెళ్లిందిట. ఎవరూ దీనికి కారణం కనుక్కోలేకపోయారుట. విసిగి వేసారి ఆ తల్లి సైకియాట్రిస్టుల వద్దకు కూడా వెళ్లిందిట. చివరికి ఓ సైకియాట్రిస్ట్ తేల్చి చెప్పిందేమిటంటే 'క్రేనియో సైకోథెరపీ' ద్వారా ఈ రోగాన్ని సరి చేయవచ్చుని, నరాలు సరిగ్గా లేనందుకే ఈ ఏడుపు అని, తన థెరపీ ద్వారా బ్యాలెన్స్ చేసి ఆ పిల్ల ఏడుపు ఆపాడట! 'హమ్మయ్య' అని సంతోషంతో ఆ తల్లి నిట్టూర్చిందిట. పాలు తాగే సమయం, నిద్రపోయే సమయంలోతప్ప ఆ పిల్ల నాన్‌స్టాప్‌గా ఏడుస్తూనే వుండేదిట. వామ్మో! మనం భరించలేం!

\- ప్రియ




కొచ్చేటప్పటికి వంటవుతుందా? లేదా? అని ఆలోచిస్తోంది.

"అమ్మా! ఆకలే!" అంటూ చంటిది మళ్ళీ కొంగులాగింది అనసూయని. రాధమ్మకి కడుపులో ఎలుకలు దూరుతున్నాయి. భోజనం ఐదు నిముషాల్లో మిస్సయింది.

"ఒణ్ణవడేయవమ్మా తల్లీ" అంది లచ్చి నాలుగో సారి.

ఉన్నట్టుండి పిన్నిగారు గేటువైపు పరుగుతీసారు. మిగిలినవాళ్లంతా విచిత్రంగా చూసారు. పిన్నిగారు వడివడిగా పోతున్న ఓ కుర్రాడిని చెయ్యెత్తి పిలిచారు "నువ్వు రాజ్యం తమ్ముడివిగాదూ!" అన్నారు అతనికి వినపడేట్టుగా.

"అవునండీ!" అన్నాడతను పిన్నిగారిని ఆశ్చర్యంగా చూస్తూ.

"ఎట్లా వుంది రాజ్యం. పురుడొచ్చిందా?" అన్నారు ఆతృతగా.

"తెలియదండీ. నేను బజారుకి వెళ్తున్నాను" అంటూ వెళ్లిపోయాడు.

గేటు ముందు నుంచి పోతున్న ఇద్దరు కాలేజీ పిల్లలు మామిడి చెట్టు కింది సమావేశాన్ని, పిన్నిగారిని చూసి "అప్పుడే మహిళా సభ ప్రారంభమయిందే" అని నవ్వుకుంటూ పోయారు. పిన్నిగారు వాళ్ళవైపు కొరకొరా చూస్తూ చెట్టు దగ్గరకొచ్చారు.

"హూ... ఆ కుర్రాడికీ తెలియదుట. వీధులట్టుకు తిరుగుతున్నాడు కుర్రకుంక" అన్నారు చిరాగ్గా.

గంట నుంచీ నిలబడి కాళ్ళు పీక్కుపోతున్నాయి అందరికీ. రాధ, అనసూయ తిన్నెమీద కూర్చున్నారు. పిన్నిగారికి వాళ్ళని కాస్త హుషారుచేయడం అవసరమనిపించింది.

"ఏమిటో మనం మగపిల్లలని అనుకుంటాంగానీ వాళ్ళు తవ్వి తలకెత్తేది ఏమీ లేదర్రా! మా పింతల్లి తోడికోడలి అల్లుడు బావమరిదికి ఒక్కడే కొడుకు. కట్టుకుపోయేంత ఆస్తి. చివరికి ఏం వెలగబెట్టాడు? తల్లిదండ్రులికి తిండి కూడా పెట్టకుండా మాడ్చి చంపాడు" అన్నారు.

రాధమ్మకి ఒళ్ళు జలదరించింది. కోపంగా చూసింది పిన్నిగారివైపు. పిన్నిగారు మళ్లీ చిక్కుల్లో పడ్డారు. ఆడపిల్లల్ని గురించి మాట్లాడితే అనసూయకి కోపం. మగపిల్లలంటే రాధమ్మకి అలుక. వీళ్లిద్దరినీ బేలెన్సింగ్‌గా నిలపడమే పిన్నిగారికి పెద్ద పని.

"అట్లాగని ఆడపిల్లలు మాత్రం ఏం వెలగబెడతారని, ఏదో ఆడ తోడు అనుకోవటమేగానీ! మా చిన్నతాత అల్లుడి కోడలు మనవడికి ఒక్కతే కూతురు. ఉన్నదంతా దానికే కట్టబెట్టారు. చివరికేం చేసింది? తల్లి పోయేటయంలో వచ్చి చూట్టానిక్కూడా దానికి తీరికలేకపోయింది. అంతా అయిపోయినాక మిగిలింది ఊడ్చుకుపోవడానికి వచ్చింది. ఏం సంతానాలో?" అన్నారు విసుగ్గా పిన్నిగారు.

రాధమ్మ మొహం విప్పారింది. అనసూయ ముఖం ముడుచుకుంది.

"పదవే పాపిష్టిదానా! అన్నం మింగుదువుగాని" అంటూ ఎత్తుకున్న పిల్లని విసురుగా కిందకి దింపింది.

సక్కుబాయిని గంట నుంచీ పట్టుకు పీడిస్తున్న అనుమానాన్ని బయటపెట్టింది హిందీలో.

"అవునూ! మనమందరం పనులన్నీ మానుకుని గంట నుంచీ ఇక్కడ పడిగాపులు పడుతున్నది ఎందుకట! ఆరుగురు ఆడపిల్లల తరువాత రాజ్యానికి ఈతూరి కూడా ఆడపిల్లేనా అన్న సందేహం తీర్చుకోవడానికేనా? అదే అయితే ఆ కబురు ఎప్పుడయినా తెలుస్తుందిగా" అంది రాధ హిందీలో.

"ఏమిటీ అంటోంది?" అన్నారు పిన్నిగారు మొహం చిట్లిస్తూ. రాధమ్మ పిన్నిగారికి తెలుగులో అనువాదం చేసి చెప్పింది సక్కుబాయి మాటని.

పిన్నిగారు నిప్పు తొక్కిన కోతికిమల్లే ఎగిరిపడ్డారు.

"గొప్ప సంగతేలే! ఇష్టం లేకపోతే ఇంట్లోకి పొమ్మను. మనమేం బొట్టు పెట్టి పిలిచామా?" అన్నారు గుడ్లురుముతూ.

పిన్నిగారి ధోరణి అనర్గళంగా సాగేదేగానీ హఠాత్తుగా వీధివైపు చూసి గేటు దగ్గరకి పరుగుపెట్టారు. సైకిలుమీద మలుపు తిరుగుతున్నతన్ని చూసి "ఏవండీ! మీరు రాజ్యం చెల్లెలి భర్త కాదూ? ఎట్లా వుంది రాజ్యం?" అన్నారు గట్టిగా కేక పెడుతూ.

అతనేదో చెబుతూ రివ్వున పోయి ఎదురింటి ప్లీడరుగారింట్లో దూరాడు.

"ఏమిటో అన్నాడర్రా ఆ అబ్బాయి. సరిగ్గా వినబడలేదు. ప్లీడరుగారింటికి వెళ్లాడు. బహుశా ఫోను చేయడానికేమో" అన్నారు ఏ కబురూ తెలియని పిన్నిగారు సాలోచనగా.

"ఒణ్ణవడేయవమ్మా తల్లీ! చంపుతున్నావు" అంది లచ్చి విసుగ్గా పదహారోసారి.

పిన్నిగారి తల్లో ఓ మెరుపు మెరిసింది.

"ఒసేయ్! అన్నంతోపాటు మాగాయ పచ్చడి కూడా పడేస్తాగానీ ప్లీడరుగారింటికి పోయి ఆ కబురేమిటో తెలుసుకురా" అన్నారు పిన్నిగారు దానికి

మాగాయి పచ్చడి ఎర చూపిస్తూ.

"ఏటమ్మా! మీదంతా ఇసిత్రం. కడుపుతోన్నమ్మ కనక మానుతుందేటమ్మా? పొద్దుగూకేలకి తెలుస్తాదిలే" అంది లచ్చి లేవడానికి నిరాకరిస్తూ.

"ఒకసారి పోయిరావే అమ్మా. ఆ కబురేదో తెలుస్తే మేం కూడా ఇంటికి పోతాం. కాసిని మజ్జిగ నీళ్ళు కూడా దిమ్మరిస్తాలే పోయిరా" అన్నారు బతిమాలుతూ, ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో.

అది అయిష్టంగానే విసుక్కుంటూ ప్లీడరుగారింటివైపు బయల్దేరింది.

"అయిదు నిముషాలయింది. ఇంకా రాదేమిటి?" అన్నారు పిన్నిగారు రెండో నిముషంలో.

"వాళ్ళ వసిదాంతో కబుర్లేసుకుందేమో పిచ్చి మాలోకం" అంది నీరసంగా అనసూయ.

"అయ్యో! ఇంకా రాదేమిటి?" అంది కడుపులో ఆకలి మండిపోతున్న రాధ.

"హా..." అంది విసుగ్గా సక్కుబాయి గేటువేపు చూస్తూ.

ఎట్టకేలకి లచ్చి ఒస్తోంది తాపీగా నడుస్తూ.

"ఏమిటే కబురు?" అన్నారు అంతా ఒక్కసారిగా.

అది మరింత నెమ్మదిగా నడిచివచ్చి "ప్చ్!" అంది అందరి మొహాలు చూస్తూ.

"ఏమిటే చెప్పేడు" గద్దించారు పిన్నిగారు.

"త్వరగా చెప్పవే నీ సస్పెన్సు పాడుగానూ" అంది రాధ.

"ప్చ్! ఈసారి కూడా ఆడకూతురేనంట!" అంది లచ్చి కింద కూర్చుంటూ. నలుగురి మొహాల్లో ఓ క్షణం సంతోషపు పొంగులాంటిది కనిపించి మరు క్షణంలో విరుత్సాహపు పూత పూసుకుంది.

"పారే" అన్నారు పిన్నిగారు సాగదీస్తూ.

"అయ్యో!" అంది అనసూయ జరక్కూడని అశుభమేదో జరిగినట్టు.

"ప్చ్!" అంది సక్కుబాయి తిన్నెమీంచి లేస్తూ.

"బాగానే వుంది" అంది రాధ చిరునవ్వుతో.

"అసలు కబురు సరిగ్గా విన్నావుటే?" అన్నారు పిన్నిగారు అనుమానం తీరక.

"ఎవర్నడిగావే?" అంది అనసూయ.

"ఎవరు చెప్పారే?" అంది రాధ.

లచ్చి జవాబు చెప్పే లోపల చెట్టు కింది సభ్యులంతా గాల్లోంచి దూసుకొస్తున్న వాసనకి ముక్కులు చిట్లించారు.

"ఎవరింట్లోనర్రా పప్పు మాడిపోతోంది?" అన్నారు పిన్నిగారు అందరి మొహాలు చూస్తూ.

"హాయ్ రామ్" అనుకుంటూ ఒక్క అంగలో ఇంటివైపు పరుగు తీసింది సక్కుబాయి.

"ఇంతకీ ఎవరు చెప్పారే?' అన్నారు పిన్నిగారు మళ్ళీ.

"అదేమ్మా ఆళ్ళ పని కుర్రాడు లేడూ రావుడు.. ఆడే సెప్పిండు. ఆడు ఇన్నాడంట అమ్మగోరు ఫోనులో మాట్లాడుతోంటే" అంది లచ్చి.

"ఓసినీ ఆఖర్ని వాడిని అడిగొచ్చావు. ప్లీడరుగారి భార్యని అడగలేదుటే?" అన్నారు కోపంగా పిన్నిగారు.

ఆవిడకి లచ్చి తెచ్చిన వార్త మీద నమ్మకం తగ్గింది.

"ఉట్టి అడవిగొడ్డు" అంది రాధ అసహనంగా.

"అమ్మోయ్ ఆకలే" అంటూ కిందపడి ఏడుస్తోంది అనసూయ చంటిది.

"ఒణ్ణవడేయవమ్మా ఇంకయినా" అంది లచ్చి పిన్నిగారి వాటావైపు దారి తీస్తూ.

హఠాత్తుగా పిన్నిగారి దృష్టి రోడ్డుమీదకు మళ్ళింది. పరుగు పరుగున గేటు దగ్గరికి వెళ్లారు భుజాల చుట్టూరా పమిట నిండుగా కప్పుకుంటూ.

"ఏవండీ రాజ్యం ఎలా వుంది? కులాసాయేనా? ఆడపిల్లటగా" అన్నారు మర్యాద ఉట్టిపడే స్వరంతో.

చేతిలో సంచీతో నడుస్తున్న రాజ్యం భర్త ఓ క్షణం ఆగి "కాదండీ! మగపిల్లవాడు. రాజ్యం కులాసాగానే వుంది" అంటూ రాజ్యాన్ని గెలుచుకున్న మహారాజ ఠీవిలో నడిచి వెళ్లిపోయాడు రాజ్యం భర్త.

పిన్నిగారు నెమ్మదిగా అడుగుతీస్తూ వెనక్కి తిరిగొచ్చారు.

"ఆఖరికి మగపిల్లాడేనన్నమాట. రావే అన్నం మింగుదువుగానీ" అంటూ నీరసంగా లోపలికి నడిచింది అనసూయ.

"మొత్తానికి మగపిల్లవాడేనన్నమాట! నలభై ఏళ్ళకి పుట్టిన వెధవ ఎప్పటికి పెరగనూ పెద్దవాడు గానూ" సక్కుబాయికి కబురు అందజేయడానికి అటువైపు నడిచింది రాధ.


"ఏవండోయ్ పిన్నిగారూ! విన్నారా కబురు. రాజ్యానికి మగపిల్లాట్ట!" అంటూ పిన్నిగారు తడవకి రెండేసి మెట్లు చొప్పున ఎక్కుతూ, ఆయాసపడుతూ మేడమీదికొస్తున్నారు ఇంటిగలవారికీ వార్త చెప్పడానికి!

"ఓయ్! నీ మనుషులు చల్లగుండా. మళ్లీ మేడెక్కిందేటయ్యా ఒణ్ణవడేయకుండా!" అనుకుంటూ చిత్రంగా చూస్తూ నిలబడింది లచ్చి.

ఇది పంచముఖిలో ఒక ఉదయం మాత్రమే!

★

## నటనే జీవితం



'మా జీవితం పేద ప్రజలకే అంకితం' అని రాజకీయనాయకులన్నట్టు 'నటనే నా జీవితం' అంటోంది మహిమా చౌదరి. పెళ్లి ఎప్పుడని అడిగితే "పెళ్ళే జీవితం కాదు. పెళ్లి గురించి నేనసలు ఆలోచించడం లేదు. మా ఇంట్లో పెళ్లికానివారు చాలామంది ఉన్నారు. నటనపైనే నా శ్రద్ధ. నా టైం అంతా సినిమాల గురించే ఆలోచిస్తున్నాను. మరో అయిదేళ్ళ వరకూ ఆ ప్రస్తావన వద్దు' అంటూ సుదీర్ఘమైన లెక్చర్ ఇచ్చింది.

- రాజా

